# కడుపు తీపి

-సూరేపల్లి విజయ

"సాయంత్రం వచ్చాక హాస్పటల్‌కి వెళ్దాం! రెడీగా ఉండు" అంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాడు శేఖర్.

ఆ మాట వింటూనే లలిత మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది. ఎంత ఏడ్చినా భారం తగ్గటం లేదు. అలాగే నిద్రపోయింది.



ఉన్నట్టుండి నిద్రలో ఉలిక్కిపడి లేచింది. కడుపు మీద చెయ్యి పెట్టి తడిమి చూసుకుంది.

'అమ్మా నన్ను చంపకమ్మా, నేను బయటకు వస్తానమ్మా' అని చెప్తున్నట్టు అనిపించింది.

'నేనేం చెయ్యను తల్లి? నిన్ను కాపాడుకోలేక పోతున్నాను. నన్ను క్షమించమ్మా' అంటూ మంచంమీద వాలిపోయింది.

లలిత ఇద్దరు ఆడపిల్ల తరువాత మూడవసారి గర్భం ధరించింది.

కొడుకు కోసం ఎదురు చూస్తూంది. ఇద్దరాడపిల్లలు పుట్టారు.

మూడోసారైనా కొడుకు పుట్టాలని అనుకున్నారు.

కాని అన్నీ మనం అనుకున్నట్టు జరిగితే అది జీవితమే కాదు. ఆడపిల్లో, మగపిల్లవాడో తెలుసు కోవడానికి స్కానింగ్ చేయించారు.

స్కానింగ్‌లో ఆడపిల్లని తెలిసింది. అప్పటినుండి లలితకు బాధ మొదలయింది.

మరొకసారి ఆడపిల్ల వద్దు అబార్షన్ చేయించు కొమ్మన్నాడు శేఖర్.

లలితలోని తల్లి మనసు అందుకు ఒప్పుకోవడం లేదు.

★ ★ ★

"ఇంకా అలా కూర్చున్నావేంటి పద హాస్పటల్‌కి" అన్నాడు.

"ఈ ఒక్కసారి వద్దండి. అబార్షన్ పాపమండి. మన పిల్లలను మనమే చంపుకున్నట్టు. దయచేసి వద్దండి. నా మాటవినండి." అంటూ ప్రాధేయపడింది.

"నన్ను అర్థం చేసుకో! ఈసారి ఆడపిల్లయితే ఎంత కష్టం. ఇప్పటికే ఇద్దరున్నారు. నా మాట విను పద హాస్పటల్‌కు" అంటూ తీసుకెళ్ళాడు. ఇక లాభం లేదని భర్తతో బయలుదేరింది.

★ ★ ★

శేఖర్ ముందే చెప్పిరావటం వల్ల వెళ్ళగానే లలితకు వెంటనే చేసింది డాక్టరు.

శేఖర్ వరండాలో కూర్చున్నాడు.

కొద్దిసేపటి తరువాత డాక్టర్ బయటకు వచ్చి "సారీ శేఖర్, అబార్షన్ చేసాను. కాని మగపిల్లవాడు, స్కానింగ్ రిపోర్ట్ మీకు తప్పుగా వచ్చింది" అంటూ వెళ్ళిపోయింది.

"సారీ అని ఒక్కమాట చెప్పి వెళ్ళిపోయింది డాక్టర్. లలితను ఎంత కష్టంగా ఒప్పించాను ఎదురుచూస్తోన్న మగపిల్లవాడు ఛాన్సుకూడా పోయింది. నాకు తగినశాస్తి జరిగింది!" అనుకున్నాడు.

సూరేపల్లి విజయ
ఇం.నెం. 1-9-11/98/1,
అజామ్‌పుర వీధి,
మెదక్ - 502 110.